

నాడు కళకళ.. నేడు వెలవెల
కళలకు నిలయమైన నాగార్జునసాగర్‌లోని రంగనాథ రంగశాల నేడు వెలవెలబోతోంది. - 0లో



కాంగ్రెస్ వైఫల్యంతోనే..
కాంగ్రెస్ పార్టీ వైఫల్యంతోనే వక్ఫ్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. - 8లో



పోలీస్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం
కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదంతో పలు వాహనాలు దగ్ధమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

7న ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ లోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈనెల 7వ తేదీన శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్స్ వెంకట్, శేఖర్, సత్యనారాయణరెడ్డి, సమ్రీన్ బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించడానికి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పీజీ బీఈడీ, యూజీ బీఈడీ పూర్తయిన వారు అర్హులని చెప్పారు. సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9010203857 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

'ఏమి చేయాలి ఇండియాలో..' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, నాయకులు

నల్లగొండ టౌన్ : బహుజన పొలిటికల్ సెంటర్ జాతీయ నాయకుడు సాధు మాల్యాద్రి రచించిన 'ఏమి చేయాలి ఇండియాలో..' అనే సిద్ధాంత గ్రంథాన్ని శనివారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డేవిడ్‌కుమార్, దర్శనం నర్సింహ, అంబటి నాగయ్య, పాలడుగు నాగార్జున, జానకిరాంరెడ్డి, చింతమళ్ల గురవయ్య, గజ్జి రవి, పందుల సైదులు, సుధాకర్ రెడ్డి, సాగర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు తెచ్చి వాహనాలు తీసుకెళ్లాలి

నల్లగొండ : కేసులు నమోదైన వాహనాలను సంబంధిత వాహనదారులు ఆరు నెలల్లోగా సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించి వారి వాహనాలు తీసుకెళ్లాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైన 14 మోటారు సైకిళ్లను నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయానికి తరలించారు. ఆరు నెలల్లోగా సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లకపోతే ఆ వాహనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 8712670170 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతలపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ : ఉపాధ్యాయులు హక్కుల కంటే తమ బాధ్యతలపై దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు బాధ్యతలపై దృష్టి పెట్టకపోతే రాబోయే పదేళ్లలో ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, శేఖర్‌రెడ్డి, ఎడ్ల సైదులు, రమాదేవి, అరుణ, రామలింగయ్య, గేర నరసింహ, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, నలపరాజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న అధికారులు'

నల్లగొండ టూటౌన్ : రేషన్‌షాపుల వద్ద ప్రధాని మోదీ ఫొటో పెట్టకుండా.. కాంగ్రెస్ నాయకుల ఫొటోలు పెడుతూ అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న బియ్యానికి ఏడాదికి రూ.10 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. రేషన్‌షాపుల వద్ద సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ మాజీ ప్రతినిధులతో ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, మిర్యాల వెంకటేశం, రమణ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు మండల కేంద్రంలోని ఒకటో నంబరు షాపులో ప్రతినెల 80 క్వింటాళ్ల బియ్యం 450 మంది రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తారు. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తుండటంతో శనివారం ఒక్కరోజే 40 క్వింటాళ్ల బియ్యాన్ని దాదాపు 200 మంది కార్డుదారులకు పంపిణీ చేశారు. గతంలో దొడ్డు బియ్యం రోజుకు 30 మందిలోపే వచ్చి తీసుకెళ్లే వారు. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తుండటంతో రెండు మూడు రోజుల్లో పంపిణీ పూర్తవుతోంది.

మిర్యాలగూడ ముత్తిరెడ్డికుంటలోని 23వ నంబరు రేషన్‌షాపులో శుక్రవారం ఒక్క రోజే 36 క్వింటాళ్ల బియ్యాన్ని 150కి పైగా కార్డుదారులకు పంపిణీ చేశారు. అలాగే 42వ నెంబరు రేషన్ షాపులో రెండు రోజుల్లోనే 65 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఇదీ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల్లో వద్ద పరిస్థితి.

సన్న బియ్యం.. క్యూ కట్టిన జనం!



మునుగోడులోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం తీసుకునేందుకు క్యూ కట్టిన లబ్ధిదారులు

- రేషన్ షాపులకు భారీగా వస్తున్న లబ్ధిదారులు
- ఐదురోజుల్లోనే చాలాషాపుల్లో రేషన్ కోటా కంప్లీట్
- పోర్టబిలిటీ ఆప్షన్‌తో పెరిగిన డిమాండ్
- డీలర్ల వద్ద మిగులు బియ్యం నిల్వలకు కాలం చెల్లినట్టే..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం కోసం జనం ఎగబడుతున్నారు. చాలాషాపుల్లో సరిపడా బియ్యం రాకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. కోటా ప్రకారం పౌర సరఫరాల శాఖ బియ్యం అలాట్ చేసింది. అయితే.. బియ్యం రేషన్ షాపు వద్దకు రావడంలో కొంత ఆలస్యం అవుతోంది. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చినప్పుడు ప్రతి నెల ఒకటో తేదీన నుంచి పదో తేదీలోగా ఎప్పుడు వీలైతే అప్పుడు వెళ్లి తెచ్చుకునే వారు. అప్పట్లో ఒక్కో రేషన్‌షాపులో రోజుకు ఐదారు క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేయగా.. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తుండటంతో లబ్ధిదారులు రేషన్‌షాపుల వద్ద బారులు దీరుతున్నారు. దీంతో ఒక్కో షాపులో రోజూ 30 నుంచి 40 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి వస్తోంది.

రేషన్ కేటాయింపులు ఇలా..

- నల్లగొండ జిల్లాలో 4,66,522 రేషన్ కార్డులు.. 13,85,506 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి 88,77,999 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రేషన్ షాపులకు 67,50,011 కిలోల బియ్యం ప్రభుత్వం కేటాయించింది.
- సూర్యాపేట జిల్లాలో 3,25,235 కార్డులు ఉండగా, 9,30,259 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికోసం 59,39,941 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, రేషన్ షాపులకు 47,31,478 కిలోలు కేటాయించింది.
- యాదాద్రి జిల్లాలో 2,17,072 కార్డులు ఉండగా, 6,64,043 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికోసం 42,40,348 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, 34,92,799 కిలోల బియ్యాన్ని కేటాయించింది.
- ప్రస్తుతం సన్న బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థ రేషన్ షాపులకు సరఫరా చేస్తోంది. ఇప్పటివరకు కేటాయింపులో 80 శాతం బియ్యం రేషన్ షాపులకు చేరగా, అందులో దాదాపు సగానికి పైగా బియ్యం ప్రజలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కార్డు ఉంటే ఎక్కడైనా బియ్యం

ప్రస్తుతం సన్న బియ్యం ఇస్తుండటంతో రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు బియ్యం తీసుకుంటున్నారు. పైగా పోర్టబిలిటీ సదుపాయం అందుబాటులో ఉండటంతో కార్డుదారులకు తమకు అందుబాటులో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి మరీ తీసుకుంటున్నారు. రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్న లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్ తీసుకునేలా గతంలోనే చర్యలు చేపట్టినా, దొడ్డు బియ్యం పెద్దగా తీసుకునే వారు కాదు. ఇప్పుడు సన్న బియ్యం కావడంతో కార్డుదారులు ముందుగానే వచ్చి తీసుకెళ్తున్నట్లు రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. దీంతో ఇకపై రేషన్ షాపుల్లో బియ్యం మిగిలే అవకాశమే లేదు. గతంలో దొడ్డు బియ్యం కావడంతో కొంతమేర డీలర్ల వద్ద మిగిలి ఉండేది. మరుసటి నెలలో దానిని సర్దుబాటు చేసే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

చెప్పలేని సంతోషం ఉంది



ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది. నేను నా భర్త వయస్సు మీదపడటంతో ఏపనీ చేయలేక ఇంటి దగ్గరే ఉండి రేషన్‌కార్డు ద్వారా వచ్చే బియ్యం తీసుకెళ్లి తినేవాళ్లం. ఎప్పుడైనా పండుగ రోజు సన్న బియ్యం బయట దుకాణంలో కిలో రూ.70 పెట్టి కొని తినేవాళ్లాం. కానీ ఇప్పుడు ఆ బాధలేదు. రేషన్ దుకాణంలోనే ఉచితంగా సన్నబియ్యం ఇస్తుండటంతో నెల రోజుల పాటు కడుపునిండా తింటాం. ఇలానే ప్రతి నెలా ఇస్తే ఎంతో ఆనందపడతాం.

– రేవెల్లి లక్ష్మమ్మ, లబ్ధిదారు మునుగోడు

ఇకనుంచి సన్నబియ్యం తింటాం



ఇంట్లో మేము ఇద్దరమే. మాకు రేషన్‌షాపుల ద్వారా 12 కిలోలు వస్తాయి. మొన్నటి వరకు దొడ్డు బియ్యం తినలేకపోయాం. మార్కెట్లో సన్న బియ్యాన్ని కొనలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయడం చాలా సంతోషకరంగా ఉంది. ఇప్పటి నుంచి రేషన్ షాపుల నుంచి వచ్చే సన్న బియ్యం తింటాం.

– వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డికుంట, మిర్యాలగూడ

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీ ఎదుట ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : యువత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కళాశాల ఎదురుగా, మర్రిగూడ బైపాస్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అంటరానితనం నిర్మూలనకు కృషి చేశాడన్నారు. జిల్లాలో అభివృద్ధిలో భాగంగా ఈనెల7న అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మరమ్మతులకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చొల్లేటి ప్రభాకర్, చక్రహరి రామరాజు, వంగూరి లక్ష్మయ్య, దున్న యాదగిరి, బొర్ర సుధాకర్, కత్తుల జగన్‌కుమార్, సంహితారాణి, పెరిక హరిప్రసాద్, ఇరిగి ప్రసాద్, అంజిబాబు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి చేరువలో సాగర్



నాగార్జునసాగర్ జలాశయం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. ప్రస్తుతం 517 అడుగులకు చేరింది. 144.7570 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే, ప్రాజెక్టులో నీటిమట్టం 510 అడుగులకు (131.6690 టీఎంసీలు)కు చేరితే డెడ్ స్టోరేజీగా పరిగణిస్తారు. సుమారు 13టీఎంసీల నీటిని వినియోగిస్తే కనీస డెడ్ స్టోరేజీకి చేరుకుటుంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23వ తేదీ వరకు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఆ తర్వాత పంటలకు నీరు బంద్ చేసినా.. మళ్లీ వర్షాలు కురిసి కృష్ణానదికి వరదలు వచ్చే వరకు తాగునీటి అవసరాలకు నీరు విడుదల చేస్తునే ఉండాలి. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు(312.450టీఎంసీలు). డిసెంబర్ 15వ తేదీన సాగర్ జలాశయంలో నీరు 580.80 అడుగులు(285.3216టీఎంసీలు) ఉంది. మూడు నెలల్లో నీటి వినియోగం అధికం కావడంతో నీటిమట్టం గణనీయంగా పడిపోయింది.

లక్ష మందిని తరలించాలి



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా నేతలు

బీఆర్‌ఎస్ నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం

- వరంగల్ సభకు జనసమీకరణపై ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో సమావేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విపరీతమైన వ్యతిరేకత ఉందన్న గులాబీ అధినేత
- ప్రజలు మనవైపు ఉన్నారు.. స్థానికంగా పోరాటాలు చేయాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి భారీ ఎత్తున ప్రజలను తరలించాలని పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. సభకు జన సమీకరణకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులతో శనివారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్ సమావేశం నిర్వహించి నియోజవకర్గాల వారీగా టార్గెట్ విధించారు. వరంగల్‌కు 100 నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నాలుగు నియోజకవర్గాల నుంచి లక్షల మందిని తరలించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆలేరు, భువనగిరి, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచే టార్గెట్‌లో సగం మంది వచ్చేలా చూడాలని సూచించినట్లు తెలిసింది. మిగతా నియోజకవర్గాల నుంచి ఆరేడు వేల మంది చొప్పున ప్రజలు వరంగల్ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, విద్యుత్, సాగునీటి విషయంలో పూర్తిగా విఫలమైందని కేసీఆర్ పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నా ఫలితం లేదని, సూర్యాపేటతో పాటు నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దానిని బీఆర్‌ఎస్ అందిపుచ్చుకోవాలని దిశా నిర్దేశం చేశారు. స్థానికంగా పరిస్థితులను బట్టి స్థానిక సమస్యలపై, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కన్నీరుపెడుతున్నారని, ఇప్పుడు ప్రజల కన్నీరు తుడిచే బాధ్యత గులాబీ జెండాదేనని ఆ దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

సీతారాముల ఎదుర్కోలు



శ్రీరామ నవమి సందర్భంగా నల్లగొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాములు ఎదుర్కోలు మహోత్సవం

ఉద్యోగం.. ఉజ్వల భవిష్యత్తుకు పునాది

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా జాబ్‌మేళా
- హాజరైన 112 కంపెనీల ప్రతినిధులు
- 6,497 మంది నిరుద్యోగుల రిజిస్ట్రేషన్



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెకర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పక్కన ఏఎస్పీ మౌనిక తదితరులు

రామగిరి(నల్లగొండ) : ఉద్యోగం.. ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రాఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన యువతేజం మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీస్‌శాఖ.. శాంతి భద్రతల నిర్వహణతోపాటు, సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లాలో పోలీస్ శాఖ తరపున జాబ్‌మేళా నిర్వహించడం ఇదే మొదటిసారని చెప్పారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దడంతోపాటు సేవా కార్యక్రమాలు చేస్తున్న పోలీస్‌శాఖను అభినందించారు. అనంతరం మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారు మొదటిసారి వేతనం తక్కువగా ఉన్నప్పటికీ నిరాశపడవద్దని, అనుభవం కోసం కృషి చేయాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 112 కంపెనీలు వచ్చాయని, 6497 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. 3300 మందిని ఆయా కంపెనీలు ఎంపిక చేసుకున్నాయని.. మరో 40 మందిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎల్‌ఐసీ ఎంపిక చేసిందని వివరించారు. ఈ జాబ్‌మేళాలో అత్యధికంగా రూ.45 వేల వేతనం పొందే ఉత్తర్వులు ఇచ్చామన్నారు. యువత సంఘవిద్రోహ శక్తులుగా తయారు కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఉద్యోగానికి ఎంపిక కాని వారు నిరాశపడొద్దని సూచించారు. జాబ్‌మేళాకు హాజరైన వారికి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా భోజన సదుపాయం కల్పించడంపై ఆయన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, డీఎస్పీ శివరాంరెడ్డి, జాబ్ కో ఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.



చంటి పిల్లలతో హాజరైన మహిళలు



నల్లగొండ పోలీస్ శాఖ నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

జగదీష్‌రెడ్డి జిల్లాకు చేసిందేమీ లేదు

- ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ : మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను విమర్శిస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తాను మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పథకం సూర్యాపేటలో ప్రారంభిచారని.. ఏ ఊరిలో కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నారు. పదేళ్లలో జిల్లాలో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లెంల, ఇతర ఏ ప్రాజెక్టులను కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తూ పేదల కడుపు నింపుతున్నామన్నారు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ డైనమిక్ అధికారులని.. వారిని కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని అనడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలు మానుకుని గౌరవాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, దుబ్బ అశోక్‌సుందర్, ముంతాజ్ అలీ, మామిడి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


మల్లేష్ (ఫైల్)

ఆలేరురూరల్: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరు పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం మందనపల్లికి చెందిన పంగ మల్లేష్ పెయింటింగ్ పనిచేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకొని ఆలేరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి వద్ద ఎదురుగా వస్తున్న వృద్ధుడిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి ఆలేరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాలకవీడు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామ సమీపంలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లికి చెందిన వట్టె నాగరాజు(37) శుక్రవారం గరిడేపల్లి మండలం కల్మల్‌చెరువులో తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో నాగరాజుకు అతడి తమ్ముడు గంగరాజు ఫోన్ చేయగా.. తాను మరో వ్యక్తితో కలిసి దాచేపల్లికి వెళ్తున్నట్లు నాగరాజు చెప్పాడు. శనివారం ఉదయం వరకు నాగరాజు ఇంటికి రాకపోవడం, ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో గంగరాజు దామరచర్ల నుంచి శూన్యపహాడ్ వెళ్లే దారిలో అన్నను వెతుక్కుంటూ వెళ్లాడు. శూన్యపహాడ్ సమీపంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు తెలుపగా.. గంగరాజు అక్కడికి వెళ్లి చూడగా నాగరాజు మృతిచెంది కనిపించాడు. నాగరాజు మృతిపై గంగరాజు అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు


నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రూ.23.75 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఏడాది కాలంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో లివర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.22కోట్ల విలువైన ఎల్‌ఓసీలు పేద ప్రజలకు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తర్వాత అతిపెద్ద పట్టణాల్లో నల్లగొండ ఒకటని, నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ, నీలోఫర్ ఆస్పత్రుల తర్వాత ఎక్కువ ప్రసవాలు నల్లగొండలో జరుగుతున్నాయన్నారు. నల్లగొండ జిల్లాలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి, నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి ఉండటంతో క్రిటికల్ కేర్ యూనిట్ అవసరమని, సంవత్సర కాలంలోనే క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలకు మరో 3 కోర్సులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

- పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు దగ్ధం


దగ్ధమైన పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనాలు

కోదాడరూరల్ : కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్‌కు ఆనుకొని ఉన్న వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టారు. ఆ నిప్పు గాలికి పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ ఆవరణలో పడడంతో రాలిన చెట్ల ఆకులకు అంటుకొని మంటలు చెలరేగాయి. దీంతో స్టేషన్ ఆవరణలో ఉంచిన పలు కేసుల్లో సీజ్ చేసిన మూడు ఆటోలు, కారు, టాటా ఏస్ వాహనం, స్కార్పియో వాహనానికి మంటలు అంటుకొని దగ్ధమాయ్యాయి. స్థానికులు, పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది రావడం ఏమాత్రం ఆలస్యమైనా పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌కు నిప్పంటుకొని పెను ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ఆలేరురూరల్: వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి అపహరించాడు. ఈ ఘటన శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలో జరిగింది. ఆలేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని సిల్క్‌నగర్‌కు చెందిన చింతకింది బాలరాజు భార్య చంద్రకళ రోజుమాదిరిగానే శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. మంతపురి రోడ్డులో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డులో చంద్రకళ వాకింగ్ చేస్తుండగా.. వెనుక నుంచి బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నం..?

మునగాల: మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముస్కు సైదిరెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాహత్నం చేసినట్లు అతడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. బాధితుడు, అతడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్కు సైదిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటారు తీసుకురావడానికి శనివారం ఉదయం తన పాలేరుతో కలిసి వెళ్లాడు. మోటారు స్టార్టర్ అమర్చిన బాక్స్‌పై ఉన్న పట్టాను సైదిరెడ్డి తొలగిస్తుండగా.. ఆయన విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే సమీపంలోని రైతులు అతడిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ స్తంభం నుంచి వైరును తీసుకొచ్చి దానిని స్టార్టర్ బాక్స్‌కు కలిపారని, డాగ్ స్క్వాడ్ గుర్తుపట్టకుండా అక్కడ కారం చల్లినట్లు సైదిరెడ్డి కుటుంబ సభ్యులు గుర్తించారు. బాక్స్‌ను సైదిరెడ్డి పట్టుకోగానే విద్యుదాఘాతానికి గురై మృతిచెందేలా ప్లాన్ చేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న మునగాల సీఐ, ఎస్‌ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి కుమారుడు శ్రీపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

'యువతేజం' జాబ్‌మేళాకు విశేష స్పందన


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న నిరుద్యోగులు


జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

- భారీగా హాజరైన నిరుద్యోగులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన యువతేజం మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించిన ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

రూ.40వేల వేతనంతో ఉద్యోగం వచ్చింది



మాది నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామం. మాది వ్యవసాయం కుటుంబం. మా అమ్మనాన్న కష్టపడి వ్యవసాయం చేసి నన్ను చదివించారు. ప్రస్తుతం జీఎన్ఎం(నర్సింగ్ కోర్సు) ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. పోలీసు శాఖ వారు ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు హాజరయ్యాను. నెలకు రూ.40వేల వేతనంలో హోమ్‌కేర్ హాస్పిటల్‌లో జాబ్ వచ్చింది.

– కందుకూరి సోని, వెలుగుపల్లి, నల్లగొండ మండలం

పోలీసు శాఖకు ధన్యవాదాలు



నేను 2013లో బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేశాను. మా నాన్న ప్రైవేట్ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తారు. ఈ జాబ్‌మేళా గురించి తెలుసుకుని హాజరయ్యాను. పలు కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరై కాగా.. రూ.45 వేల వేతనంతో పీహెచ్‌సీ సొసైటీ హోమ్‌కేర్ సర్వీస్‌లో జాబ్ వచ్చింది. ఈ అవకాశం కల్పించిన పోలీసు శాఖ వారికి ధన్యవాదాలు.

– ఉప్పుల ఉదశ్రీ, నల్లగొండ

ఉద్యోగ కల నెరవేరింది



డిగ్రీ పూర్తిచేసి ఖాళీగా ఉన్నాను. ఉద్యోగం లేక అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాను. పోలీసు శాఖ వారు ఏర్పాటు చేసిన జాబ్ మేళా అవకాశాన్ని చూపింది. నెలకు రూ.14వేలు జీతంతో ప్రైవేట్ కార్ షోరూం నందు జాబ్ లభించింది. నా ఉద్యోగ కల నెరవేరింది.

– ఆర్. మోహన్, నల్లగొండ

జాబ్ చేస్తూ చదువుకుంటా



ఇటీవల ఇంటర్ పూర్తి చేశాను. జాబ్‌మేళాలో ప్రైవేట్ కంపెనీలో రూ.16 వేల వేతనంతో జాబ్ వచ్చింది. ఈ జాబ్ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని ఉన్నత చదువులు చదివి ఇంకా మంచి ఉద్యోగం సంపాదిస్తాను.

– నారగోని శివాని, చిన్న సూరారం


జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కాంగ్రెస్ పార్టీ వైఫల్యంతోనే వక్ఫ్ బిల్లుకు ఆమోదం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


గూడూరు మోహన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వలిగొండ: కాంగ్రెస్ పార్టీ వైఫల్యంతోనే వక్ఫ్(సవరణ)–2025 బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. వలిగొండ మండలం ఎదుళ్లగూడెం గ్రామానికి చెందిన నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఎస్‌ఈ గూడూరు మోహన్‌రెడ్డి సంతాప సభను శనివారం టేకుల సోమారం సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి కల్వకుంట్ల కవిత హాజరై మోహన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ముస్లిం మైనార్టీల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. వక్ఫ్(సవరణ)–2025 బిల్లు ప్రవేశపెడుతున్న సందర్భంలో లోక్‌సభలో రాహుల్ గాంధీ నోరు మెదపలేదని, ప్రియాంక గాంధీకి లోక్‌సభకు రావడానికి కూడా తీరిక లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. అనంతరం టేకుల సోమారం గ్రామానికి చెందిన పనుమటి జంగారెడ్డికి చెందిన ఎండిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువుకాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోస పట్టదని, పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఎస్‌ఈ గూడూరు మోహన్‌రెడ్డి తన సొంత డబ్బుతో పాటు భూమిని కూడా దానమిచ్చి శ్రీవెంకటేశ్వర ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి 600 ఎకరాలకు సాగునీరందించి రైతులకు ఎంతో మేలు చేశారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈఈలు శ్యాంసుందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్తిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మ వెంకట్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, డేగల పాండరి, ఎండీ అఫ్రోజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు..

భువనగిరిటౌన్: భువనగిరి మండలం నందనంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కవిత శనివారం పూజలు చేశారు. వలిగొండ వెళ్తున్న ఆమెకు భువనగిరి వద్ద మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ అమరేందర్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ పంచాయతీకి చెందిన సుర్కంటి ప్రతాప్‌రెడ్డి శనివారం రాత్రి బైక్‌పై గుండ్రాంపల్లి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండ్రాంపల్లి గ్రామ శివారులోని శ్రీపతి ల్యాబ్స్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా.. గుర్తుతెలియని వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు వెంటనే హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చెరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మానసిక ఒత్తిడితో కార్మికుడి ఆత్మహత్య


షేక్ సయ్యద్ మృతదేహం

చౌటుప్పల్ రూరల్: మానసిక ఒత్తిడితో ఉరేసుకుని కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం పసునూరు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్(50) కుటుంబంతో కలిసి జీవనోపాధి కోసం చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామానికి వలస వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. గత 20ఏళ్లుగా భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామ పరిధిలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచింది. కానీ సయ్యద్‌కు మాత్రం జీతం పెంచలేదు. దీంతో కొద్దిరోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్నాడు. శుక్రవారం పరిశ్రమకు వెళ్లిన సయ్యద్ తన కంటే జూనియర్లకు జీతం పెంచి తనకు ఎందుకు పెంచలేదని పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగాడు. 'ఇక్కడ పనిచేస్తే చెయ్.. లేదంటే వెళ్లిపో' అని పరిశ్రమ యాజమాన్యం అనడంతో ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని భార్యతో చెప్పి బాధపడ్డాడు. సొంతూరికి వెళ్దామని, సామాను సర్దమని భార్యకు చెప్పాడు. శుక్రవారం రాత్రి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రించిన సయ్యద్ అర్ధరాత్రి మరొక గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం సయ్యద్ కుమార్తె నిద్ర లేచి చూడగానే తండ్రి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో తల్లికి చెప్పింది. చుట్టుపక్కల వారు వచ్చి సయ్యద్‌ను కిందికి దించగా అప్పటికే మృతిచెందాడు. తన చావుకు కంపెనీ యాజమాన్యం మరియు శేఖర్ అనే వ్యక్తి కారణమని రాసిన లెటర్ లభ్యమైంది. మృతుడి భార్య షేక్ జానిబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- శిథిలావస్థలో నాగార్జునసాగర్‌లోని రంగనాథ రంగశాల
- అద్దెకిచ్చి మినీ థియేటర్‌గా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు


రంగనాథ రంగశాలలో పెరిగిన కంపచెట్లు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్లు తమ శ్రమను మర్చిపోయి ఆనందంగా గడిపేందుకు హిల్ కాలనీలో రంగనాథ రంగశాలను నిర్మించారు. ఇందులో నిత్యం నాటకాలు ప్రదర్శించేవారు. అలనాటి సినిమా తారలు నూతన్‌ప్రసాద్, సావిత్రి, రేలంగి, జగ్గారావు, రాజనాల వంటి వారు రంగనాథ రంగశాలలో స్టేజీపై నాటకాలు వేశారని అప్పటి ఉద్యోగులు చెబుతుంటారు. సాగర్ ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చే ఉన్నతాధికారులు, విదేశీయులు సైతం ఇందులో వేసే నాటకాలు చూసి అబ్బుర పడేవారని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో సినిమా థియేటర్లు వచ్చాక రంగనాథ రంగశాలలో నాటకాలు ప్రదర్శన ఆగిపోయాయి.

కొంతకాలం సమావేశాలకు వినియోగం

ఆ తర్వాత కొంతకాలం వరకు రంగనాథ రంగశాలను సమావేశాలు నిర్వహించేందుకు వినియోగించారు. గత కృష్ణా పుష్కరాల సమయంలో భక్తులు సేద తీరేందుకు గాను రూ.50లక్షలు ఖర్చు చేసి విద్యుత్ సౌకర్యం, ఫ్లోరింగ్, వాష్‌రూమ్స్, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం నిర్వహణ లేక రంగనాథ రంగశాల ఆవరణలో కంపచెట్లు మొలిచాయి. బస్టాండ్‌కు సమీపంలో ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. విద్యుత్ బోర్డులు, ఫ్యాన్లు చోరీకి గురయ్యాయి. నాగార్జునసాగర్‌లో గతంలో మూడు సినిమా థియేటర్లు ఉండేవి. నేడు ఒక్క థియేటర్ కూడా లేదు. స్థానికులు సినిమా చూడాలంటే హాలియా, మాచర్ల, మిర్యాలగూడకు వెళ్తుంటారు. రంగనాథ రంగశాలను అద్దెకిస్తే మినీ థియేటర్‌గా ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, చీఫ్ ఇంజనీర్‌కు సినిమా థియేటర్ల నిర్వహణలో అనుభవం కలవారు దరఖాస్తు చేశారు. కానీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిని అద్దెకిస్తే ప్రాజెక్టు అధికారులు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుంటుందని స్థానికులు అంటున్నారు.

అద్దెకిస్తే వినియోగంలోకి వస్తుంది



రంగనాథ రంగశాలను అద్దెకిస్తే వినియోగంలోకి వస్తుంది. ప్రాజెక్టు అధికారులు సమయానుకూలంగా సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుంటుంది. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ఉంటాయి.

– శివ, స్థానిక వ్యాపారి

సాగర్‌లో థియేటర్ లేదు



సాగర్‌లో ఒకప్పుడు మూడు సినిమా థియేటర్లు ఉండేవి. నేడు ఒక్కటి కూడా లేదు. వారాంతంలో సినిమాలు చూసేందుకు స్థానికులు సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. రంగనాథ రంగశాలను లీజుకు తీసుకుని మినీ సినిమా థియేటర్‌గా రూపొందిస్తే పూర్వ వైభవం వస్తుంది.

– భాస్కర్, ఉపాధ్యాయుడు